క్లుప్తంగా

చర్యలు తీసుకుంటాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా

మెళియాపుట్టి: ఉపాధి హామీ పనులు తప్పనిసరిగా ప్రారంభించాలని ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించని క్షేత్రస్థాయి సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. వారాంతపు, అత్యవసర సమావేశాలకు హాజరుకాక పోయిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో 8 మంది క్షేత్ర సహాయకులు గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేయాల్సిన ఉపాధి పనులు గుర్తించే బాధ్యత సాంకేతిక సహాయకులు తీసుకోవాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేయాల్సిన పనులు గుర్తించాలన్నారు.

భగవద్గీత పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న శ్రీలక్ష్మీ జాహ్నవి

నరసన్నపేట: స్థానిక విద్యార్థి భవన్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని మంగు శ్రీలక్ష్మీ జాహ్నవి జిల్లా స్థాయిలో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో ప్రథమ స్థానం పొందింది. వేదం ఇంటర్నేషనల్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కొత్తూరులోని మహర్షి పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి భగవద్గీత, స్పెల్–బీ పోటీలు సోమవారం నిర్వహించారు. దీంట్లో సీనియర్ విభాగంలో శ్రీలక్ష్మీ జాహ్నవి మొదటి బహుమతి పొందినట్లు స్కూల్ డైరెక్టర్ ఆరంగి గోవిందరావు తెలిపారు. గీతా జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

స్వెట్టర్ల పంపిణీ



స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ అమీర్ అలీ

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–3 ఆర్ఆర్ కాలనీలో హరీష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగ నిలయంలోని చిన్నారులు, వృద్ధులకు ఆదివారం రాత్రి స్థానిక ఎస్ఐ అమీర్ అలీ స్వెట్టర్లు పంపిణీ చేశారు. దాతలు అందజేసిన సహకారంతో స్వెట్టర్లు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు కతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న గిరిజన సంఘం, సీఐటీయూ నేతలు

మెళియాపుట్టి: గిరిజనుల హక్కుల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని పలు గిరిజన సంఘాల నాయకులు అన్నారు. మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలనే నినాదంతో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు పోలాకి ప్రసాదరావు మాట్లాడుతూ.. మండలంలోని గిరిజనులకు బంజరు, పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. 50 శాతం గిరిజన ప్రజలు నివాసముండే పంచాయతీలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. పలు సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ రాము, ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండాలకు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకుడు సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులు ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

హిరమండలం: గ్రామస్తులు ఐక్యంగా ఉండాలని పాతపట్నం సీఐ సి.హెచ్.ప్రసాద్ సూచించారు. భగీరథపురంలో సోమవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామస్తులు విభేదాలకు దూరంగా ఉండాలన్నారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో గ్రామంలో శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో అన్నివర్గాలు, కులాల వారు ఐక్యతతో ముందుకెళ్లాలన్నారు. ఈ విషయంలో గ్రామపెద్దలు చొరవ చూపాలని కోరారు. ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఎటువంటి సమస్య తలెత్తినా శాంతి కమిటీ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతరావు, ఎస్ఐ ఎండీ యాసిన్, సర్పంచ్ చిరంజీవులు, సీపీఎం నేత సింహాచలం, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా!

- రూ.18 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- చోద్యం చూస్తున్న అధికారులు



సర్వే నంబర్ 322-2లో మట్టివేసి చదును చేసిన దృశ్యం

పొందూరు: ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జా చేసేందుకు కొంతమంది ఎగబడుతున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. కాదేది ఆక్రమణకు అనర్హం అనే విధంగా అడుగులు వేస్తున్నారు. కన్నుపడితే చాలు భూమిని ఆక్రమించి విక్రయాలు జరిపేస్తున్నారు. ప్రభుత్వ భూమితోపాటు డీపట్టా, పోరంబోకు, చెరువు గర్భాలను ఆక్రమిస్తున్నారు. ఆక్రమణదారులకు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పొందూరు రెవెన్యూ పరిధిలో రూ.18 కోట్ల విలువైన 1.88 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వివరాల్లోకి వెళ్తే..

పొందూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి రాపాక సెంటర్, రాపాక సెంటర్ నుంచి కొంచాడ వైపు భూముల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎకరా రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ధరలు పలుకుతోంది. ఇక్కడ ఆక్రమణలు జోరందుకుంటున్నాయి. రాపాక కూడలిలో 322–2 సర్వే నంబర్‌లో సుమారు 1.88 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయాల రికార్డుల్లో ఇది చెరువు గర్భంగా నమోదై ఉంది. సుప్రీం కోర్టు తీర్పు మేరకు చెరువు గర్భాల ఆక్రమణ నేరం. అయినప్పటికీ కొంతమంది అక్రమార్కులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూమిని ఆక్రమించి చదును చేశారు. ఇక్కడ చదును చేసిన మట్టి కూడా అక్రమంగా జేసీబీలతో తీసినదే కావడం గమనార్హం.



ఆక్రమణలతో కుచించుకుపోతున్న బట్టి

తప్పుడు సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు..

చెరువు గర్భంగా నమోదై ఉండటంతో ఈ సర్వే నంబర్‌లో ఎవరికీ ఎటువంటి పట్టాలు ఇవ్వలేదు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూమి పక్కనున్న సర్వే నంబర్‌లో ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సిబ్బందికి భారీగా లంచాలు ఇచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొంత మంది ఈ భూమిలో నిర్మాణాల కోసం బోర్లు సైతం వేస్తున్నారు. మరికొందరు నిర్మాణాలకు సన్నద్ధమవుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

చెరువు గర్భాల్లో ఆక్రమణలు నేరం. పొందూరు పరిధిలోని సర్వే నంబర్ 322–2లో సర్వే చేయిస్తాం. ఆక్రమణలు చేపట్టినట్లు గుర్తిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– వెంకటేష్ రామానుజం, తహసీల్దార్, పొందూరు

పింఛన్లు తొలగించడం అన్యాయం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: పింఛన్లను ఏరివేతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలను ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారని ఒక ముద్రవేసి పింఛన్లు తొలగించడం అన్యాయమన్నారు. 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్లు ఇస్తామని నమ్మించి, అధికారం చేపట్టిన తరువాత ఉన్న పింఛన్లు తొలగించేందుకు చర్యలు తీసుకోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్ డబ్బులతో జీవిస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గత ఆరు నెలలుగా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే ఆన్‌లైన్ సర్వీసులను ఈ ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందని నిలదీశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీ ఆరు నెలలకు ఒకసారి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఈ ఏడాది జనవరిలో తమ ప్రభుత్వంలో కొత్త పింఛన్లు ఇచ్చామన్నారు. అప్పటి నుంచి ఏడాది కాలంగా అర్హులకు పింఛన్లు ఇవ్వలేని దుస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఆరు నెలల పాలనలో ఇప్పటికే 1.57 లక్షల పింఛన్లు తొలగించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోనూ చేపట్టిన సర్వేతో ఇంకెంతమందికి పింఛన్లు తొలగిస్తారో వేచి చూడాలన్నారు. కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, కాలనీ ఇళ్లు ఎప్పుడు ఇస్తారో ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామ వలంటీర్లను కొనసాగిస్తామని, నెలకు రూ.10వేలు జీతం ఇస్తామని నమ్మించిన చంద్రబాబు.. వలంటీర్లను తొలగించి వారి జీవితాలను రోడ్డున పడేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

భాస్కరరావుకు కవిరత్న పురస్కారం

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన దుబ్బ భాస్కరరావుకు కవిరత్న పురస్కారం వరించింది. తెలంగాణలోని కరీంనగర్‌లో సోమవారం జాతీయ స్థాయి కవి సమ్మేళనం, పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. భాస్కరరావు 20 సంకలనాలలో కథలు, పాటలు, కవితలు రాశారు. వీటిని నిర్వాహకులు పరిశీలించి కవిరత్న పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ రచయితలు మౌనశ్రీ, తురిమెళ్ల శంకర్ నారాయణ తదితరులు భాస్కరరావుకు మెమొంటో అందించి సత్కరించారు. పలువురు కవులు పాల్గొన్నారు.



భాస్కరరావును సత్కరిస్తున్న సినీ రచయితలు, నిర్వాహకులు

108 సేవలపై ఆరా



ప్రజలకు 108 వాహనం ద్వారా మేలైన సేవలందించాలని 108 వాహనాల జిల్లా మేనేజర్ బొమ్మాళి హరిప్రసాద్ సూచించారు. సారవకోట మండల కేంద్రంలో ఉన్న 108 వాహనాన్ని సోమవారం పరిశీలించారు. వాహనం పనితీరు, సేవలపై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితులలో ఎటువంటి ఫోన్ వచ్చినా వెంటనే సంఘటనా స్థలానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

– సారవకోట

రక్షణ గోడ శిథిలం



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస నుంచి పురుషోత్తపురం వరకు గల ఆర్అండ్‌బీ రహదారిలోని మురగడ బట్టిపై శిథిలమైన రక్షణగోడ. రాకపోకలు చేసే సమయంలో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారీన పడుతున్నారు. ఈ రహదారిలో యరగాం–పురుషోత్తపురం చానల్‌పైన, మురగడ బట్టిపైన నిర్మించిన బ్రిడ్జీలతోపాటు, రక్షణ గోడలు పూర్తిగా పాడయ్యాయి. ఇసుక ర్యాంపునకు చెందిన భారీ లారీలు ప్రయాణాలు చేయడం వలన మరింత శిథిలమై ప్రమాదస్థితిని తలపిస్తున్నాయని స్థానికులు తెలిపారు.

– సరుబుజ్జిలి

మందుబాబులకు అడ్డాగా..



నరసన్నపేట మండల కేంద్రంలోని దేశవానిపేట పశువుల ఆస్పత్రి ప్రాంగణం మందు బాబులకు అడ్డాగా మారింది. ఈ ప్రాంగణంలో సచివాలయం, రైతు సేవా, వెల్‌నెస్ కేంద్రాలు ఉండటంతో పగలంతా హడావిడిగా ఉంటుంది. చీకటి పడిందంటే మందు బాబులకు అడ్డాగా ఈ ప్రాంగణం మారుతుంది. గంజాయి వంటి మత్తు పదార్థాలు కూడా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. పశువుల ఆస్పత్రి శివారున మందు బాబులు బెంచీ కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

రోడ్డుపైనే మురుగునీరు..



ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేటలోని ప్రధాన వీధిలో డ్రైనేజీ లేకపోవటంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఎల్.ఎన్.పేట మండల కేంద్రం నుంచి లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. ప్రధాన వీధిలోని ఇళ్లల్లో వాడిక చేసిన నీరు ఆర్అండ్‌బీ రోడ్డుపైనే ప్రవహిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

కొత్తూరు: వంశధార ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పారాపురం బ్యాలన్సింగ్ రిజర్వాయర్ కోసం సేకరించగా మిలిగిన ఉన్న భూములో వ్యవసాయం చేసేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని తహసీల్దార్ రవిచంద్రను గ్రామానికి చెందిన పలువురు కోరారు. సోమవారం పారాపురంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు గ్రామానికి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్, కిరణకుమార్, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. మిగుల భూములకు రైతు పేరున అడంగల్ సక్రమంగా రావడం లేదన్నారు. అడంగల్ భూమి యజమాని పేరిట రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. మండలంలోని గూనభద్ర, పారాపురం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 13 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, ఆర్ఐ లక్ష్మణరావు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్ అల్లు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పారాపురం గ్రామస్తులు

ఐసీడీఎస్ ప్రాజెక్టు తనిఖీ

పాతపట్నం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని విశాఖపట్నం రిజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి అన్నారు. పాతపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టును సోమవారం తనిఖీ చేశారు. స్టాక్, తదితర రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరు, ప్రాజెక్టులో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎంతమంది ఉన్నారని పీఓ విమలారాణిని అడిగి తెలుసుకున్నారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరుపై ఆరా తీశారు. 2005లో బాలికా సంరక్షణ పథకం కింద అనుమతి పత్రం అందించారని, ధ్రువపత్రాలు ఇంతవరకు ఇవ్వలేదని ఆర్జేడీకి మెళియాపుట్టికి చెందిన బలగ భవానీ ఫిర్యాదు చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఎం.కుమార్, వసంత కుమార్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఆర్జేడీ చిన్మయిదేవికి ఫిర్యాదు అందజేస్తున్న భవానీ

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

పాతపట్నం: ఫిజియోథెరపీతో అంగవైకల్యాన్ని దూరం చేయవచ్చని ఎంఈఓ–2 సి.హెచ్.తిరుమలరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలోని భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు సోమవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఇంటి వద్ద క్రమం తప్పకుండా వ్యాయామం ఎలా నిర్వహించాలో తల్లిదండ్రులకు, ఐఈఆర్‌టీఎస్‌లకు ఫిజియోథెరపిస్టు ఎస్.ఈశ్వరరావు అవగాహన కల్పించారు. ఐఈఆర్‌టీఎస్‌లు పి.సుధారాణి, ఎస్.ఇన్నా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

హిరమండలం: మర్రిగూడ పంచాయతీలోని సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘ నాయకుడు కె.రమేష్, మర్రిగూడ సర్పంచ్ యు.సురేష్ మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలో జీలకర్రగూడ, మర్రిగూడ, దాసుమానుగూడ, పుట్టిగాం, బంగారుగూడ, కిరిడివలస, అంతిలి తదితర గ్రామాల్లోని గిరిజనులు మౌలిక వసతులకు దూరంగా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గృహ నిర్మాణానికి సంబంధించి అటవీశాఖ అనుమతి వెంటనే ఇప్పించాలని కోరారు. 1,500 ఎకరాలకు సంబంధించి పోడు పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. శివారు గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించాలన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికలు, బస్ షెల్టర్లు, సామాజిక భవనాలు నిర్మించాలని కోరారు. ఐటీడీఏ పరంగా మరిన్ని సౌకర్యాలు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన సంఘాల నేతలు, మర్రిగూడ పంచాయతీ పరిధిలోని గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కొత్తూరు: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న అన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో వైద్యం, విద్యా రంగాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ రవిచంద్రకు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం నాయకులు సిర్ల ప్రసాద్, చిన్నమ్మి, ఎలియా, జనార్దన్, కిలోడియా, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

ఇంటర్వ్యూ..



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో ఏర్పాటు చేయనున్న కేజీబీవీ–4 పాఠశాలకు మంజూరైన హెడ్‌కుక్, కుక్, చౌకీదార్ పోస్టులకు సోమవారం ఎమ్మార్సీలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ పోస్టులకు 209 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 111 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంఈఓ ఎం.వి.రమణ తెలిపారు. మంగళవారం మిగిలిన వారికి ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వరుస దొంగతనాలు

- ఒక్కరు ఉన్న దుకాణాలే టార్గెట్

సారవకోట: మండల కేంద్రంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. ఒక్కరే ఉన్న దుకాణాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సోమవారం సారవకోటలోని ఓ దుకాణానికి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారు. ఒక వ్యక్తి బైక్‌పై ఉండి ఇంజిన్ స్టార్ట్‌లో ఉంచగా.. మరో వ్యక్తి దుకాణ యజమాని లాడి ధనలక్ష్మిని పురితాళ్లు కావాలని అడిగాడు. ఆమె పురితాళ్లు తెచ్చే లోపల డబ్బాతో ఉన్న డబ్బులు తీసుకుని ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. డబ్బాలో సుమారు రూ.2 వేలు ఉంటుందని దుకాణదారు తెలిపారు. ఐదు రోజుల క్రితం సారవకోటలోని పాన్ షాపులో వృద్ధుడికి ఇదే విధంగా లోపల ఉన్న వస్తువులు కావాలని అడగగా.. ఆయన వాటిని తీసుకొచ్చే లోపల డబ్బాలో ఉన్న డబ్బులు తీసుకుని ఉడాయించారు. వరుస దొంగతనాలపై స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నరసన్నపేట: స్థానిక కల్వరి బాప్టిస్టు చర్చిలో నరసన్నపేట నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్ల కుటుంబాలు సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించాయి. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాకుళం పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ పి.కృపానందం మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని కోరారు. పాస్టర్ల కుటుంబాలకు చెందిన 60 మందికి క్రిస్మస్ కానుకగా వస్త్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర క్రిస్టియన్ సెల్ (టీడీపీ) జనరల్ కార్యదర్శి బోసుబాబు, నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పి.జాన్‌డేవిడ్, బగ్గు సునీల్, పి.బాలరాజు, సాంబమూర్తి, బి.ప్రేమానందం, సుందరరావు, మోషే తదతరులు పాల్గొన్నారు.



ఆరాధన చేస్తున్న పాస్టర్లు

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ సోమవారం తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోగా కళాశాలలోని స్కిల్ సబ్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9553292734ను సంప్రదించాలన్నారు.

పక్కాగా పశుగణన

పాతపట్నం: అఖిల భారత 21వ పశుగణను పశుసంవర్ధకశాఖ సిబ్బంది పక్కాగా చేపట్టాలని పాతపట్నం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలోని పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయంలో పశుగణనపై పశు వైద్యులు, సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎన్యుమరేటర్లు పూర్తి సమాచారం సేకరించాలన్నారు. ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు 30 నుంచి 40 ఇళ్ల వరకు సర్వే చేయాలని సూచించారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో పశు గణన ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. పాతపట్నం మండలంలో 16,074 ఇళ్లల్లో సర్వే చేయాల్సి ఉండగా 8,556 ఇళ్లు, మెళియాపుట్టి మండలంలో 12,851 ఇళ్లు సర్వే చేయాల్సి ఉండగా 5,788 ఇళ్లు సర్వే చేశారన్నారు. కొరసవాడ, పెద్దలోగిడి పశువైద్యులు పి.అనిల్‌కుమార్, కె.మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాలకు చెందిన పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

పొందూరు: మండలంలోని గోరింట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ధాన్యం విక్రయించిన రెండు, మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు, సర్పంచ్ సి.హెచ్.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

బూర్జ: మండలంలోని టీ.డీ.ఆర్.రాజుపేటలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు గ్రామ నాయకుడు ఇప్పిలి సిమ్మన్న, తదితరులు తెలిపారు. సోమవారం గ్రామంలో రహదారి పనులు ప్రారంభించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ముంపు తట్టుకొనే వరి రకాలు పండించాలి

సరుబుజ్జిలి: ముంపును తట్టుకొనే వరి రకాలను రైతులు పండించుకోవాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. నిర్రాదత్తత గ్రామం ఇస్కలపాలెంలో రైతులతో కలిసి సోమవారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఎంటీయూ 1061 ఇంద్ర రకం విత్తనం ముంపును తట్టుకొంటుందని గుర్తుచేశారు. రైతులు పెరటికోళ్ల పెంపకం, పెరటి తోటల పెంపకం, అధిక దిగుబడులు వచ్చేందుకు రబీలో ప్రత్యాయ పంటలను అధికంగా వేయాలని సూచించారు. మత్స్య విభాగం నుంచి సి.హెచ్.బాలకృష్ణ, సేద్య విభాగం నుంచి కిరణ్‌కుమార్, ఎస్సార్ఎఫ్ నిర్రా నుంచి డాక్టర్ హేమలత, రైతులు పాల్గొన్నారు.

మత్తుతో చిత్తు..

జలుమూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జలుమూరు ఎస్ఐ పి.అశోక్ బాబు సూచించారు. జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మండల కేంద్రంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం నాశనం అవుతుందన్నారు.